# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 2, ఏప్రిల్ 2026




## ముఖ్యమంత్రి సభా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 01, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని పిప్రి గ్రామానికి ఈనెల 6న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేస్తున్న నేపథ్యంలో, బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహజన్, ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్ సభా స్థలాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హెలిప్యాడ్ నిర్మాణం, జన సమీకరణ, వాహనాల పార్కింగ్ వంటి అంశాలపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఎక్కడా లోటుపాట్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ మాట్లాడుతూ.. సభకు వచ్చే వాహనాల పార్కింగ్ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా పరంగా అధికారులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో కె. శ్రీనివాస్, బోథ్ సీఐ డి. గురుస్వామి, ఎస్ఐ సంజయ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి

**ఉట్నూర్, ఏప్రిల్ 1,ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న అన్నారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయం ముందర బ్లాక్ డే సందర్భంగా నిరసనలు చేపట్టారు. బొజ్జ ఆశన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని నాలుగు లేబర్ కోడ్స్ అమలు అయితే కార్మికులు తమకు అందే హక్కులన్నీ కోల్పోతారని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన పోరాటాలు చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి రత్నమాల, అంగన్వాడి యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ముక్త,స్వర్ణలత మండల నాయకులు పార్వతి,,రేణుక,లక్ష్మి,సురేఖ,పద్మ, కళావతి, జయ, గ్రామపంచాయతీ యూనియన్ ఉట్నూర్ మండల కార్యదర్శి ఆత్రం సుందర్, మండల నాయకులు పూర్కా ప్రభు,భారత్ తదితరులు పాల్గొన్నారు.




## మహిళల ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేయూత

- ❊ కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి మార్గం
- ❊ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి, ఏప్రిల్ 01, ప్రభాతవార్త**

మహిళల సంక్షేమంతో పాటు వారి ఆర్థికాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం రోజున బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణ

మిగతా 2లో..

### గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే..

## కఠిన చర్యలు

- జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్ రావు హెచ్చరిక
- కోటపల్లి మండలంలోని ఐదు గ్రామ పంచాయతీల్లో డీపీఓ ఆకస్మిక తనిఖీ
- విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అన్నారం కార్యదర్శిపై ఆగ్రహం

**కోటపల్లి, ఏప్రిల్ 01, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్ రావు బుధవారం కోటపల్లి మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. మండలంలోని అన్నారం, వెల్మపల్లి, లక్ష్మీపూర్, బబ్బెరచెల్క, మరియు పారుపల్లి గ్రామ పంచాయతీలను సందర్శించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అన్నారం గ్రామ పంచాయతీ సందర్శనలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండటం, వీధుల్లో చెత్త పేరుకుపోవడంపై డీపీఓ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంపై పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌ను మందలించారు. విధుల్లో నిర్లక్ష్యం



మిగతా 2లో..

### జనాభా లెక్కల ప్రక్రియను

## పకడ్బందీగా చేపట్టాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**



జనాభా లెక్కల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ హరిత పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జనాభా లెక్కలు 2027పై నిర్వహించిన మూడు రోజుల శిక్షణా తరగతుల్లో చివరి రోజు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జనాభా లెక్కలు 2027కు సంబంధించి ఎలాంటి తప్పులకు తావులేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మండల స్థాయి గణికులు సూపర్వైజర్లకు శిక్షణ ఇచ్చేందుకు ప్రతి మండలం నుండి ఒకరు చొప్పున ఫీల్డ్ ట్రైనర్లను ఎంపిక చేసి వారికి మూడు రోజుల పాటు సమగ్రమైన శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. జనాభా లెక్కల సేకరణలో అనుసరించాల్సిన పద్ధతులు, సాంకేతిక అంశాలపై ఫీల్డ్ ట్రైనర్లకు పూర్తిస్థాయి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. డేటా సేకరణలో నాణ్యతను పెంచాలని సూచించారు. ప్రతి ఇంటి సమాచారాన్ని అత్యంత ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, ఈ ప్రక్రియలో ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా చూడాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సి.పి.ఓ వాసుదేవ రెడ్డి, మాస్టర్ ట్రైనర్ హుస్సేన్, ఇతర సంబంధిత శాఖల అధికారులు, శిక్షణ పొందిన ఫీల్డ్ ట్రైనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు

**(మొదటిపేజీ తరువాయి)**

వహిస్తే శాఖాపరమైన చర్యలకు లిఖితపూర్వకంగా సిఫారసు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు డీపీఓ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలి. అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్లు, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గురించి ప్రజలకు విపులంగా వివరించాలి. మార్చి 23 నుంచి జూన్ 12 వరకు అమలులో ఉన్న 99 రోజుల ప్రగతి ప్రణాళిక, గ్రామ ప్రొఫైల్ నివేదికలను సిద్ధంగా ఉంచుకోవాలి. డ్రైనేజీల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలి. ప్లాస్టిక్, గాజు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి. సేగ్రిగేషన్ షెడ్లలో తడి, పొడి చెత్తను వేరు చేసి, సేంద్రీయ ఎరువుల ఉత్పత్తి జరిగేలా చూడాలి. గ్రామ పంచాయతీ ఆస్తుల సంరక్షణలో, అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోపాలు ఉన్నా పంచాయతీ కార్యదర్శులదే బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

**తాండూర్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :**



మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళలు పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన తాండూర్ తహసిల్దార్ జ్యోత్స్న వెంటనే బెషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ మంచిర్యాల జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు మండిగ రవీందర్ డిమాండ్ చేశారు. తాండూర్ ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధిత ఆదివాసి మహిళలతో కలిసి ఆయన మాట్లాడారు. తమ పోడు భూముల సమస్యలపై మార్చి 30న తాండూర్ తహసిల్దార్ కార్యాలయానికి వినతి పత్రం ఇవ్వడానికి వెళ్ళిన ఆదివాసి మహిళల పట్ల తహసీల్దార్ అనుచిత వ్యాఖ్యలు చేసి ఆదివాసీ మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత ఆదివాసి మహిళలు గంగుల లక్ష్మి, టేకం జ్యోతి, టేకం సాలక్క, టేకం శంకరమ్మ, కోయ భాగ్య, ఊరడి బుజ్జమ్మ మాట్లాడుతూ తహసిల్దార్తమ సమస్యలు వినకుండా సాటి మహిళల పట్ల చూపాల్సిన గౌరవం ఇవ్వకుండా అవమానకరంగా అనుచిత వ్యాఖ్యలు చేసిందని ఆరోపించారు. తహసిల్దార్ వెంటనే క్షమాపణ చెప్పాలని మహిళలు డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి నాయకులు యాపల సమ్మయ్య, గడ్డం మణికుమార్, టేకం రాజేష్, ఊరడి మహేష్, మండిగ చిన్నయ్య, టేకం రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బోడెపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ మండలంలోని బోడెపల్లి గ్రామంలో గల ఎంపీయూపీఎస్ పాఠశాలలో బుధవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ముఖ్యంగా నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారుల ప్రతిభకు హాజరైన అతిథులు ప్రశంసలు కురిపించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సమగ్ర వికాసం కోసం ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అతిథులు అభినందించారు. ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రాజయ్య, ఉపసర్పంచ్ నరసయ్య, మాజీ ఎంపీటీసీ శ్యామ్ రావు, గ్రామ పెద్దలు, మండల విద్యాశాఖాధికారి వాసాల ప్రభాకర్ గారు, భట్పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఉపాధ్యాయులు శృతి, సాయి శేఖర్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవతో మూడు నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు

**నేరడిగొండ, ఏప్రిల్ 01, ప్రభాతవార్త:**

బోథ్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చేసిన నిరంతర కృషి ఫలించింది. నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో నూతనంగా మూడు విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరయ్యాయి. బోథ్ మండలంలోని ధన్నూర్ (బి), నేరడిగొండ మండలంలోని కుప్టి (కుమారి), తలమడుగు మండలంలోని కుచులపూర్ గ్రామాల్లో ఈ సబ్ స్టేషన్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. బుధవారం ధన్నూర్ (బి) గ్రామంలో సబ్ స్టేషన్ కోసం కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేయూత

**(మొదటిపేజీ తరువాయి)**

కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, అలీప్ సంస్థ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా స్వావలంబన దిశగా నడిపించేందుకు ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రాంప్ ప్రాజెక్టు ద్వారా స్వయం సహాయక సంఘాలు, స్టార్టప్‌లను ఎంఎస్ఎంఈలుగా అభివృద్ధి పరచడానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మహిళల సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు రుణ సదుపాయం అందించి వివిధ వ్యాపారాల వైపు ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో ఉచిత కుట్టు శిక్షణ అందించడం ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందేలా చేయడం జరుగుతుందని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని, కుటుంబ పోషణలో భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. తమకు నచ్చిన రంగంలో ప్రతిభ కనబరిచి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు విద్యార్థుల దుస్తుల తయారీ బాధ్యతలు అప్పగించడం జరిగిందని, వాటిని సకాలంలో పూర్తి చేసినందుకు అభినందించారు. ఎంఎస్ఎంఈ ప్రోత్సాహక కార్యక్రమాల్లో భాగంగా రాంప్ పథకం ద్వారా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, అలీప్ సంయుక్తంగా మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1500 స్వయం సహాయక సంఘాలు, 500 మహిళా అంకుర సంస్థల అభివృద్ధి లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పరిశ్రమల నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్, నైపుణ్యాభివృద్ధిపై 15 రోజుల శిక్షణ అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు.

## నూతన ఆర్థిక సంవత్సరంలో శ్రీరాంపూర్ ఏరియా మంచి లాభాలు ఆర్జించాలి: జీఎం

### - ఫైనాన్స్ విభాగంలో ఘనంగా లక్ష్మీ పూజ

**నస్పూర్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**



నూతన ఆర్థిక సంవత్సరంలో శ్రీరాంపూర్ ఏరియా మంచి లాభాలు ఆర్జించాలని జీఎం మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా బుధవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ ఫైనాన్స్ విభాగంలో ఏజీఎం (ఫైనాన్స్) సుమలత ఆధ్వర్యంలో లక్ష్మి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని కోరారు. ఎలాంటి విఘ్నాలు లేకుండా సింగరేణి అభివృద్ధి పథంలో సాగాలని ఆకాంక్షించారు. ప్రతి ఏటా కొత్త ఆర్థిక సంవత్సరం మొదటి రోజున ఫైనాన్స్ విభాగంలో పూజలు చేయడం ఆనవాయితిగా వస్తోంది. ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు సంస్థ ఆర్థికంగా బలోపేతం కావాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ప్రతినిధి వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎం దామోదర్ రావు, ఎస్టేట్స్ మేనేజర్ వరలక్ష్మి, ఏరియా పర్చేస్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఫైనాన్స్ విభాగం అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎండల్లో కార్మికుల ఆరోగ్యానికి మజ్జిగ పంపిణీ

### - కేకే ఓసీపీకి రికార్డు డిస్పాచ్ గౌరవం

### - మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ

**మందమర్రి, ఏప్రిల్ 01, ప్రభాతవార్త**

పెరుగుతున్న ఎండల నేపథ్యంలో కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మందమర్రి ఏరియాలోని కేకేఓసీపీ ప్రాజెక్టులో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ బుధవారం రోజున ప్రారంభించారు. ప్రాజెక్ట్ కాంటీన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన స్వయంగా కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన జీ.ఎం రాధాకృష్ణ కేకే ఓసీపీ సాధించిన ఉత్పత్తి విజయాలను ప్రస్తావించారు. మార్చి 31, 2026న ఒక్కరోజులోనే 10,909.44 టన్నుల బొగ్గు డిస్పాచ్ చేసి కొత్త రికార్డు సృష్టించిందని తెలిపారు. అలాగే మార్చి నెలలో మొత్తం 2,30,464 టన్నుల బొగ్గు రవాణా జరగడం ప్రాజెక్ట్ చరిత్రలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందని చెప్పారు. ప్రాజెక్ట్ ప్రారంభం నుంచి ఇదే అత్యధిక ఒక్కరోజు డిస్పాచ్ కావడం విశేషమని పేర్కొంటూ, మందమర్రి ఏరియా ఉత్పత్తి పురోగతిలో కేకేఓసీపీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ విజయాలు ఉద్యోగుల క్రమశిక్షణ, నిబద్ధత, సమిష్టి కృషి ఫలితమని కొనియాడారు. ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుతూ భవిష్యత్తులో మరిన్ని లక్ష్యాలను సాధించాలని కార్మికులను ఆయన ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం. మల్లయ్య, ప్రాజెక్ట్ ఇంజనీర్ ఎన్. వెంకటవంశీధర్, సీఎంఓఏఐ మందమర్రి అధ్యక్షుడు ఎస్. రమేష్, ఏఐటీయూసీ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ రాజేష్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





## బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**భైంసా, ఏప్రిల్ 01, ప్రభాతవార్త:**

ముధోల్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన బొల్లాం రాజేశ్వర్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కును బుధవారం అందజేశారు. భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు, ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి భోస్లే నారాయణరావు పాటిల్ బాధిత కుటుంబ సభ్యులకు రూ. 60,000 విలువ గల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముధోల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల గంగారెడ్డి, శ్యామ్ రావు పాటిల్, ప్రేమనాథ్ రెడ్డి, వెంకటాపూర్ సర్పంచ్ కిషన్ పాటిల్, లోకేశ్వరం మండల అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్ర, ముత్యం రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్ అష్టా, సర్పంచ్ శ్రీనివాస్, దేవీదాస్, మధు పాటిల్, వాటోలి ఉప సర్పంచ్ ఓం ప్రకాష్, నరేంద్ర పార్డీ, జాడే శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో నేత్ర దాత లింగంపల్లి వర్షిత జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 01, ప్రభాతవార్త**

ప్రజలు అపోహలు వీడి నేత్ర, అవయవ దానానికి ముందుకు రావాలని జనహిత సేవా సమితి పిలుపునిచ్చింది. బుధవారం రోజు బెల్లంపల్లి పట్టణంలోని కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ 396వ సారి అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నేత్ర దాత లింగంపల్లి వర్షిత జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ, సమాజంలో ఉన్న అపోహలను తొలగించి ప్రజలు నేత్ర, అవయవ దానానికి ముందుకు రావాలని కోరారు. నేత్ర దాత లింగంపల్లి వర్షిత స్ఫూర్తితో బెల్లంపల్లి ప్రాంతంలో మరింత మంది దాతలు ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జనహిత అన్నపూర్ణ శాశ్వత అన్నదాతల సహకారంతో యాచకులు, నిరుపేదలు, కూలీలు, చిరువ్యాపారులు, బాటసారులకు ఒక పూట భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో సుమారు 180 మందికి భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో దాతల పాత్ర కీలకమని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా మరింత మంది దాతలు సహకరించాలని నిర్వాహకులు కోరారు. సహాయం అందిస్తున్న ప్రతి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేత్ర దాత కుటుంబ సభ్యులతో పాటు జనహిత సేవా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కాంపెల్లి విజయ్ కుమార్, కార్యవర్గ సభ్యులు భీమిని కనకయ్య, నిచ్చకోల గురుస్వామి, బోనాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యోగుల సమిష్టి కృషితోనే నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాల సాధన సాధ్యం

**శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ - గత ఆర్థిక సంవత్సర ఫలితాల వెల్లడి.. 2026-27 ఏడాదికి 64.30 లక్షల టన్నుల లక్ష్యం**

**నస్పూర్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**



ఉద్యోగుల సమిష్టి కృషితోనే నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాల సాధన సాధ్యమని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసిన నేపథ్యంలో బుధవారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఏరియా సాధించిన ప్రగతిని వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో 65.16 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 44,06,291 టన్నుల ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. ఎస్సార్పీ 1, ఆర్.కె న్యూ టెక్ గనులు వంద శాతం ఫలితాలు సాధించి రికార్డు సృష్టించాయన్నారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఓసీపీలు, గనుల కంటే 40 రోజుల ముందే లక్ష్యాన్ని పూర్తి చేసిన ఆర్.కె న్యూ టెక్ గని ఏరియాకు గర్వకారణంగా నిలిచిందని ప్రశంసించారు. ఎస్సార్పీ 1 గని కూడా 22 రోజుల ముందే తన లక్ష్యాన్ని చేరుకుందని చెప్పారు. ఆర్.కె 5, ఆర్.కె 7 గనులు కూడా వంద శాతం ఉత్పత్తికి చేరువగా ఉన్నాయని మునిగంటి శ్రీనివాస్ వివరించారు. ఎస్సార్పీ 3, 3ఏ, ఐకె 1ఏ గనులు కూడా బొగ్గు ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలను కనబరిచాయన్నారు. ఉపరితల గనుల్లో కొన్ని ఓబీ కాంట్రాక్టుల ఒప్పంద సమస్యల వల్ల ఆశించిన స్థాయిలో మట్టి తొలగింపు జరగలేదని స్పష్టం చేశారు. దీనివల్ల బొగ్గు ఉత్పత్తికి ఆటంకాలు ఎదురై వార్షిక లక్ష్యాన్ని పూర్తి చేయలేకపోయామని తెలిపారు. భూగర్భ గనుల జీవిత కాలం పెరగడం వల్ల కార్మికులకు ఉపాధి భద్రత మరింత పెరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. 2026-27 సంవత్సరానికి యాజమాన్యం 64.30 లక్షల టన్నుల లక్ష్యాన్ని విధించింది. అధికారులు, కార్మికులు ముందస్తు ప్రణాళికతో సమిష్టిగా కృషి చేసి ఈ లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమానికి తమ ఏరియా అగ్రతాంబూలం ఇస్తోందని మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. ప్రమాదంలో అంగవైకల్యం పొందిన కార్మికుడికి కోటి రూపాయల బీమా చెక్కును అందజేశామని చెప్పారు. కారుణ్య నియామకాల ద్వారా మెడికల్ ఇన్ వాలిడేషన్ పొందిన 3828 మంది వారసులకు ఉద్యోగాలు కల్పించినట్లు వివరించారు. ఏరియాలో తాగునీటి సరఫరాకు ఎక్కడా ఇబ్బంది లేకుండా నిరంతర సరఫరా చేస్తున్నామన్నారు. 277 మందికి ఎల్ఎస్పీ, 21 మందికి ఎంఎంసీ చెల్లింపులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. 9734 మంది విశ్రాంత ఉద్యోగులకు వైద్య సేవల కోసం ప్రత్యేక మెడికల్ కార్డులు పంపిణీ చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం ఎన్. సత్యనారాయణ, ఏజీఎం (ఫైనాన్స్) సుమలత, డీజీఎంలు ఎస్. అనిల్ కుమార్, రాజన్న, సీనియర్ పీవో ఎస్. సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మిక వర్గానికి మరణశాసనాలు: కామిల్ల దేవయ్య

**- శ్రీరాంపూర్‌లో నల్ల బ్యాడ్జీలతో కార్మికుల నిరసన**

**నస్పూర్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**



శ్రీరాంపూర్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టియు నాయకులు

నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మిక వర్గానికి మరణశాసనాలు అని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కామిల్ల దేవయ్య విమర్శించారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం శ్రీరాంపూర్‌లో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు చేస్తోందని వారు ఆరోపించారు. ప్రస్తుతం దేశంలోని ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసే కార్మికులకు ఎలాంటి చట్టాలు వర్తించడం లేదని కామిల్ల దేవయ్య పేర్కొన్నారు. పని గంటలపై నిబంధనలు లేవు. వేతనాలు సరిగ్గా అందడం లేదు. ఉద్యోగ భద్రత కరువైంది. యాజమాన్యాలు కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పారిశ్రామిక సంబంధాల కోడ్, వేతనాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తిపరమైన భద్రత పని పరిస్థితుల కోడ్ తీసుకురావడం దారుణమని మండిపడ్డారు. ఈ లేబర్ కోడ్లను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకువస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం వెనక్కి తగ్గే వరకు ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డివిజన్ కోశాధికారి తిరుపతి రెడ్డి పాల్గొన్నారు. సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు శంకరి, సత్యం, అప్పారావు, జి. శంకర్, సంతోష్, కనకయ్య, ఎం. శంకర్, తిరుపతి, రాజయ్య, బాపు, సంతోష్, కనుకయ్య, రమ, లలిత, గౌరమ్మ, నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ఎస్ఐఆర్ లో ప్రతి ఒక్క కార్యకర్త భాగస్వామ్యం కావాలి

**- రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు**



**మంచిర్యాల, ఏప్రిల్1, ప్రభాతవార్త**

కేంద్ర ఎన్నికల సంఘం త్వరలో తెలంగాణ రాష్ట్రంలో త్వరలో చేపట్టే ప్రత్యేక ఓటర్ సవరణ ప్రక్రియ ఎస్ ఐ ఆర్ పై పార్టీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో చేపట్టాల్సి న కార్యక్రమాల పై ఈరోజు బీజేపీ మంచిర్యాల జిల్లా కార్యాలయంలో జిల్లా పదాధికారులు, సీనియర్ నాయకులు, మండల నాయకులతో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం 2002 సంవత్సరరం అనంతరం మళ్లీ ఇప్పుడు దేశ వ్యాప్తంగా ఎస్ ఐ ఆర్ చేపట్టడం జరుగుతుంది అని తెలిపారు. మన రాష్ట్రంలో కూడా త్వరలో జరిగే కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యి ప్రతి ఒక్క బూత్ కు ఎన్నికల సంఘం ఆదేశం మేరకు పార్టీ తరపున బూత్ లెవెల్ ఏజెంట్ ను నియమించాలని తెలిపారు. తప్పులు లేని ఓటర్ల జాబితా కోసం అందరూ కృషి చేసి ఎన్నికల కమిషన్ అధికారులకు సహకరించాలని కోరారు. అదే విధంగా ఏప్రిల్ 6 న బీజేపీ పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, మంచిర్యాల మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గాజుల ముఖేష్ గౌడ్, దుర్గం అశోక్, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, ఎనగందుల కృష్ణ మూర్తి, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.


పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు అంబరావ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# ఉపాధ్యాయులు లేనిది విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణం కష్టం

**- ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

**నేరడిగొండ, ఏప్రిల్ 01, ప్రభాతవార్త:**

ఉపాధ్యాయులు లేనిది విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణం కష్టమని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నేరడిగొండ మండలంలోని కుంటాల ఆశ్రమ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. అంబరావ్ పదవీ విరమణ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, అంబరావ్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, వారు లేనిదే విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణం అసాధ్యమని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులుగా అంబరావ్ తన విధి నిర్వహణలో విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకున్నారని కొనియాడారు. పాఠశాల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి, అభివృద్ధిలో భాగస్వామ్యమయ్యారని గుర్తుచేశారు. పదవీ విరమణ తర్వాత కూడా విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ సమాజ సేవలో కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను కలిసి క్రికెట్ టోర్నమెంట్‌కు ఆహ్వానిస్తున్న వడూర్ గ్రామ యువకులు, సర్పంచ్.

# బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసిన వడూర్ యువత

**నేరడిగొండ, ఏప్రిల్ 01, ప్రభాతవార్త:**

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామ యువకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఈనెల 3వ తేదీ నుండి గ్రామంలో ప్రారంభం కానున్న వడూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఎమ్మెల్యేను కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. యువత క్రీడల్లో రాణించాలని, గ్రామీణ స్థాయి పోటీలు క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వడూర్ సర్పంచ్ శ్రీకాంత్, నాయకులు భూషణ్, నవీన్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

# నేరడిగొండ మండలంలో వడగండ్ల వర్షం

**ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం**

నేరడిగొండ, ఏప్రిల్ 01, ప్రభాతవార్త:

నేరడిగొండ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా గాలివాన బీభత్సం సృష్టించింది. మండలంలోని తేజాపూర్, కుప్టి, కుమారి, బుద్ధికొండ తదితర గ్రామాల్లో సుమారు గంట పాటు ఏకధాటిగా వడగండ్ల వాన కురిసింది. అకాల వర్షం వల్ల సాగులో ఉన్న జొన్న, మొక్కజొన్న పంటలకు నీటి కొరత తీరిందని రైతులు భావిస్తున్నారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న జనం, ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు. అయితే గాలివాన వల్ల అక్కడక్కడా చెట్లు విరిగిపడటంతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.



# మందమర్రి ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 104 శాతం పూర్తి

## సింగరేణిలో మందమర్రి ఏరియా మూడో స్థానం - సౌర విద్యుత్ ఉత్పత్తిలోనూ ముందంజ

## కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం, ఆధునిక సదుపాయాల విస్తరణ - మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ

**మందమర్రి, ఏప్రిల్ 01, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థకు చెందిన మందమర్రి ఏరియా 2025-26 ఆర్థిక సంవత్సరాంతంలో బొగ్గు ఉత్పత్తి, సౌర విద్యుత్ ఉత్పత్తి రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించింది. బుధవారం రోజు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ఈ వివరాలను వెల్లడించారు. మార్చి నెలలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని మించి 104 శాతం సాధించడం ద్వారా సింగరేణి వ్యాప్తంగా మందమర్రి ఏరియా మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు. ముఖ్యంగా కేకే5 అండర్ గ్రౌండ్ గని 100 శాతం లక్ష్యాన్ని చేరుకుని ప్రతిభ కనబరిచిందని పేర్కొన్నారు. అలాగే కేకే ఓపెన్ కాస్ట్ గని మార్చి 31న ఒక్కరోజులోనే 10,909 టన్నుల బొగ్గు డిస్పాచ్ చేసి రికార్డు సృష్టించడం విశేషమన్నారు. సౌర విద్యుత్ రంగంలో కూడా మందమర్రి ఏరియా మెరుగైన ఫలితాలు నమోదు చేసింది. 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ద్వారా 47.48 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి (106 శాతం) సాధించగా, కాసిపేటలోని 50 మెగావాట్ల సోలార్ ప్లాంట్ 20.40 మిలియన్ యూనిట్ల (105 శాతం) విద్యుత్ ఉత్పత్తి చేసి సింగరేణిలో రెండో స్థానాన్ని పొందిందని తెలిపారు. పర్యావరణ



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం రాధాకృష్ణ

పరిరక్షణతో పాటు ప్రత్యామ్నాయ శక్తి వనరుల వినియోగంలో సంస్థ ముందంజలో ఉందని ఆయన వివరించారు. ప్రాసెసింగ్ ఓవర్ బర్డెన్ ప్లాంట్ ద్వారా మట్టి నుంచి రోజుకు సుమారు 1500 క్యూబిక్ మీటర్ల ఇసుకను ఉత్పత్తి చేస్తున్నామని, ఈ ఇసుకను భూగర్భ గనుల్లో స్టోయింగ్ కోసం వినియోగిస్తున్నామని తెలిపారు. అందులో 500 క్యూబిక్ మీటర్లను ప్రత్యేకంగా కాసిపేట01 అండర్ గ్రౌండ్ గనికి కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ విధానం గనుల భద్రతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. కార్మికుల సంక్షేమం విషయంలో సంస్థ ప్రత్యేక దృష్టి సారించిందని జీఎం పేర్కొన్నారు. కేకే1 డిస్పెన్సరీలో అత్యాధునిక ఫిజియోథెరపీ విభాగాన్ని ప్రారంభించడం ద్వారా కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. అదేవిధంగా సీఈఆర్ క్లబ్ మరియు కమ్యూనిటీ హాళ్లను ఆధునీకరించి ఏసీ సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఇది కార్మికుల విశ్రాంతి, వినోదం మరియు సామాజిక కార్యక్రమాలకు మరింత అనుకూలంగా ఉంటుందని అన్నారు. ఇక నైపుణ్యాభివృద్ధి దిశగా సీఎస్ఆర్ నిధులతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో కాస్మెటాలజీ కోర్సును ప్రారంభించామని, ప్రస్తుతం 31 మంది శిక్షణ పొందుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉపాధి ఆధారిత కోర్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ విజయాల్లో భాగస్వాములైన కార్మికులు, అధికారులు, యూనియన్ ప్రతినిధులకు జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ఆర్థిక సంవత్సరంలో కూడా లక్ష్యాలను మించి సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్ఓటు జీఎం జి.ఎల్ ప్రసాద్, డీజీఎం పర్సనల్ అశోక్, డీజీఎం ఐఈడి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్పత్తి-రక్షణలో కేకే-5 గని సరికొత్త మైలురాయి

## - 100 శాతం ఉత్పత్తి లక్ష్య సాధన అభినందనీయం: జీఎం రాధాకృష్ణ

**మందమర్రి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**



సింగరేణి సంస్థలోని కేకే-5 గని ఉద్యోగులు ఉత్పత్తి, రక్షణ రంగాల్లో ముందుండి ఆదర్శంగా నిలుస్తున్నారని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ తెలిపారు. వంద శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన సందర్భంగా గని ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అధికారులను, ఉద్యోగులను అభినందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, కేకే-5 గని గత కొన్ని సంవత్సరాలుగా ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు రక్షణ విభాగంలో కూడా ముందంజలో నిలుస్తోందని ప్రశంసించారు. అధికారులు, ఉద్యోగుల పరస్పర సహకారం, వృత్తి నైపుణ్యం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాలుగా గనికి రెండు లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించగా, వంద శాతం సాధించిందని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండు లక్షల ఇరవై వేల టన్నుల లక్ష్యాన్ని కూడా పూర్తిగా సాధించడం విశేషమని అన్నారు. ఇది అధికారులు, ఉద్యోగుల సమిష్టి కృషి ఫలితమని పేర్కొన్నారు. మూడు సంవత్సరాలుగా లక్ష్యాలను అధిగమిస్తూ అదనపు ఉత్పత్తి కోసం కృషి చేస్తున్న కేకే-5 గని సిబ్బంది ఇతర గనుల ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ ఏరియా అభివృద్ధిలో కూడా ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం సింగరేణి సంస్థ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సమయంతో సంబంధం లేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. అలా పనిచేస్తేనే సంస్థ ప్రగతి సాధ్యమవుతుందని తెలిపారు. సింగరేణి ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమానికి యాజమాన్యం పెద్దపీట వేస్తుందని కూడా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేకే-1 గ్రూప్ ఏజెంట్ రాంబాబు, గని మేనేజర్ శంభూనాథ్ పాండే, రక్షణ అధికారి రమేష్, సంక్షేమ అధికారి ఎ. రవళి, గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, కేకే-5 గని ఇంచార్జ్ కంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేక అధికారి దుర్గం శంకర్

# ప్రజాపాలనలో ప్రజలను భాగస్వామ్యం చేయాలి

**దిలావర్‌పూర్, ఏప్రిల్ 01, ప్రభాతవార్త:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ప్రజలందరినీ భాగస్వామ్యం చేయాలని జిల్లా పరిషత్ సీఈవో, మండల ప్రత్యేక అధికారి దుర్గం శంకర్ అధికారులకు సూచించారు. బుధవారం దిలావర్‌పూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి, స్థానిక సమస్యలపై ప్రజల అభిప్రాయాలను సేకరించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, గ్రామాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాలని కోరారు. ఈ సభల్లో ప్రజాప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు, యువకులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సభల నిర్వహణ తీరు, చర్చించాల్సిన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణాని, ఎంపీఓ గోవర్ధన్, ఏఈఓ రాజశేఖర్ రెడ్డి, ఎంఈఓ సదానందం, ఏపీవో దివ్య రెడ్డి, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


డ్రోన్ పరికరాన్ని అందజేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

# కలెక్టర్ చేతుల మీదుగా డ్రోన్ అందజేత

## - ఆధునిక వ్యవసాయానికి శ్రీకారం

**సారంగాపూర్, ఏప్రిల్ 01, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని కొట్టాల(బి) గ్రామ రైతుల సహకారంతో ఏర్పాటైన మ్యాక్స్ సంఘానికి అత్యాధునిక వ్యవసాయ పరికరమైన డ్రోన్‌ను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అందజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మొదటిసారిగా 40 శాతం సబ్సిడీతో ఈ డ్రోన్ పరికరాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా సభ్యులు ఈ డ్రోన్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, ఆధునిక పద్ధతుల్లో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందుల పిచికారీ చేయడానికి ఈ డ్రోన్ ఎంతో ఉపయోగపడుతుందని హర్షం వ్యక్తం చేశారు. రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వానికి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్ రెడ్డి, మ్యాక్స్ అధ్యక్షులు భూమారెడ్డి, మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు నకిరెడ్డి నర్సరెడ్డి, సభ్యులు సాయిందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, పోతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సత్యనారాయణ గౌడ్‌కు ఘన సన్మానం: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియామకం

**సారంగాపూర్, ఏప్రిల్ 01, ప్రభాతవార్త:**



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియమితులైన సత్యనారాయణ గౌడ్‌ను సారంగాపూర్ మండల బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ఈ పదవి దక్కిందని నాయకులు పేర్కొన్నారు. సత్యనారాయణ గౌడ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు సాధారాం రెడ్డి, కోరిపల్లి రాజు రెడ్డి, పతాని నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ఏర్పాటు

**వేమనపల్లి, ఏప్రిల్ 01, ప్రభాతవార్త**



పెరుగుతున్న వేసవి ఎండల ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు వేమనపల్లి బస్టాండ్ సమీపంలో చలివేంద్రంను మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్ కుమార్ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసి ప్రారంభించారు. తన తండ్రి ఆర్. నారాయణ రావు జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ, గాలి మధు, సర్పంచ్‌లు చెన్నూరి సమ్మయ్య, వుప్పులవు సాయికృష్ణ, అలం లక్ష్మణ్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల నాణ్యమైన విద్య, ప్రజలకు మెరుగైన వైద్యం ప్రభుత్వ లక్ష్యం

### - మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి, ఏప్రిల్ 01, ప్రభాతవార్త**

ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధితో పాటు మహిళల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం బెల్లంపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ కుమార్ దీపక్. పాఠశాల అభివృద్ధి పనులు, తరగతి గదులు, మూత్రశాలలు, పరిసరాల పరిశుభ్రతను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారం, శుద్ధమైన త్రాగునీరు అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బోధన విధానం విద్యార్థులకు అర్థమయ్యేలా ఉండాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తరగతుల్లో విద్యార్థులను ప్రశ్నిస్తూ వారి అభ్యాస సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు.



రికార్డులు, రిజిస్టర్లను పరిశీలిస్తున్న కలెక్టర్

రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని, వివిధ ధ్రువపత్రాలను నిర్ణీత గడువులో జారీ చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యాలయ సమయపాలనపై కఠినంగా వ్యవహరిస్తూ హాజరు పట్టికను పరిశీలించిన కలెక్టర్ విధుల్లో నిర్లక్ష్యం వహించిన 11 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ఆసుపత్రిలో అందుతున్న సేవలు, వార్డులు, మందుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. తదుపరి బట్వాన్పల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్, వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరంలో ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, మెరుగైన చికిత్సతో పాటు ఉచితంగా మందులు అందించాలని సూచించారు. జిల్లాలో విద్య, ఆరోగ్య, సంక్షేమ రంగాల్లో మెరుగుదలకు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు.



## పులిమడుగు గ్రామంలో ఎంపీడీవో అభివృద్ధి పనుల పర్యవేక్షణ

**మందమర్రి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

మందమర్రి మండలంలోని పులిమడుగు గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. గ్రామంలోని నర్సరీ, గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, రోడ్డు నిర్మాణం వంటి పలు కార్యక్రమాలను ఆయన పరిశీలించి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సమయానికి పూర్తి కావాలని, పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాభివృద్ధికి సంబంధించిన ప్రతి పనిని పారదర్శకంగా, ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామంలో నిర్వహిస్తున్న పిల్లల టీకా కార్యక్రమాన్ని కూడా పరిశీలించి, ప్రతి చిన్నారికి సమయానికి టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు టీకాలు ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరమని, అధికారులు-ప్రజలు కలిసి పని చేస్తేనే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు.




## మధుమేహం బారిన పడకుండా మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలి

**జన్నారం, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

మధుమేహం బారిన పడకుండా మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలి అని జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమంలో భాగంగా జన్నారం మండలంలోని తపాలపూర్ గ్రామంలో బుధవారం రోజున ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ ఆధ్వర్యంలో ఎన్సీడీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 30 సంవత్సరాల పైబడిన వారందరికీ మధుమేహం పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాశ్రీ మాట్లాడుతూ 30 సంవత్సరాల పైబడిన వారందరికీ మధుమేహం, రక్తపోటు పరీక్షలు చేసి వాటికి సంబంధించిన వ్యాధిగ్రస్తులను గుర్తించి మందులు పంపిణీ చేయడం జరుగుతుందని, అంతేకాకుండా ప్రతినెల వారికి రిస్క్రీనింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. రక్తపోటు, మధుమేహం వ్యాధుల నివారణకు మంచి ఆహారపు అలవాట్లు, యోగ, మెడిటేషన్ వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మురిమడుగుల కవిత రాజన్న, ఉపసర్పంచ్ మామిడి రాజన్న, హెల్త్ సూపర్వైజర్ జంగమ్మ, ఎంఎల్హెచ్పి సందీప్, హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్, మాధవి, పంచాయతీ కార్యదర్శి రమేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:**



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల దృష్ట్యా, ప్రశాంత వాతావరణ పరిస్థితులను సవ్యంగా కొనసాగించడానికి ఏప్రిల్ 1 నుండి 30 వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ నితిక పంత్ బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. 30 పోలీస్ యాక్ట్1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డీఎస్పీ, ఎస్పీ ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవిధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదన్నారు. చట్టపరమైన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం శిక్షార్హులు అవుతారని సూచించారు

## బాలికల ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

**బెజ్జూర్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం డిడి రమాదేవి, జిసిడిఓ శకుంతల సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు 100 ఉత్తీర్ణులు అయ్యే విధంగా పరీక్షలకు సన్నద్ధులు కావాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారికి పలు సూచనలు చేశారు. భోజనంలో మెను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలు చేస్తున్న అధికారులు

## ఐటిడిఏ ఉద్యాన నర్సరీని సుందరంగా తీర్చిదిద్దాలి

**ఉట్నూర్, ఏప్రిల్ 1, ప్రభాత వార్త :**

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్, అసిస్టెంట్ కలెక్టర్ సలోని చాబ్రా తో కలిసి ఉట్నూర్ మండల కేంద్రంలోని ఉద్యాన మరియు శిక్షణ కేంద్రం (హెచ్ఎన్టిసి) ని సందర్శించారు ఈ సందర్భంగా 50 ఎకరాల ఉద్యాన నర్సరీని సుందరంగా పార్కు లాగా తీర్చిదిద్దడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, సందర్శకులు వచ్చి సేదదీరేలాగా ఏర్పాట్లు చేయాలని, విశ్రాంతి భవనాన్ని తిరిగి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఐటిడిఏ ఉద్యాన అధికారి సందీప్ కుమార్ ను ఆదేశించారు. రాక్ గార్డెన్, బటర్ఫ్లై గార్డెన్, లాన్, వంటివి ఏర్పాటు చేయాలనీ, పిల్లలకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలనీ సందీప్ కుమార్ ని ఆదేశించారు.



నర్సరీని సదర్శించిన్న అసిస్టెంట్ కలెక్టర్

## ట్రాన్స్‌ఫార్మర్‌తో పొంచి ఉన్న ప్రమాదం

### - పట్టించుకోని అధికారులు

**క్యాతన్‌పల్లి, ఏప్రిల్ 01, ప్రభాతవార్త**

క్యాతన్ పల్లి మున్సిపాలిటీలోని గద్దె రాగడి ప్రాంతంలో క్రీస్తు స్కూల్ ముందు ప్రధాన రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్. రహదారి విస్తరణలో భాగంగా రోడ్ పక్కన మట్టి పోయడంతో విద్యుత్ నియంత్రిక భూమిలో కూరుకుపోయి అత్యంత ప్రమాదకరంగా మారింది. వేలాది మంది వాహనాల పై పనుల నిమిత్తం ప్రయాణాలు సాగిస్తుంటారు. బస్సులలో, ఇతర వాహనాలలో ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేరవేస్తుంటాయి, వివిధ సరుకుల రవాణా సైతం భారీ వాహనాలు ఈ రహదారి గుండా ప్రయాణిస్తుంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు మంచిర్యాలలోని పాఠశాల, కళాశాలలకు వెళ్లి వచ్చే మార్గం ఇదే కావడం గమనార్హం. వందల సంఖ్యలో విద్యార్థులు నిత్యం స్థానిక పాఠశాలకు వచ్చి పోతుంటారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి ప్రక్కన ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉన్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేసి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది.



# కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

- రాష్ట్రంలో లేబర్ కోడ్స్ అమలు చేయమని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలి
- కార్మికుల పట్ల కేంద్ర బీజేపీ ప్రభుత్వం విధానాలు నశించాలి
- విద్యుత్ సవరణ బిల్లు 2022ను వెనక్కి తీసుకోవాలి
- సీఐటీయు ఆధ్వర్యంలో బ్లాక్ డే సందర్భంగా నల్ల బ్యాడ్జి , ప్లే కార్డులతో నిరసన
- సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్

**మంచిర్యాల, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**



నిరసన వ్యక్తం చేస్తున్న సభ్యులు

కేంద్ర కార్మిక సంఘాలు సిఐటియు కమిటీ పిలుపులో భాగంగా బుధవారం మంచిర్యాల పట్టణ కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో బ్లాక్ డే సందర్భంగా నల్ల బ్యాడ్జి, ప్లే కార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. బ్రిటిష్ కాలంలో పోరాడు సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చింది. ఈ నాలుగు లేబర్ కోడ్స్ అమలు అయితే, కార్మికులు సంఘం పెట్టుకునే , సమ్మె చేసే హక్కులు పోతాయన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ ను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వడం ద్వారా కార్మికులకు తీవ్రంగా నష్టం జరుగుతుందన్నారు. ధర్నా లాంటి పోరాటాలు, కరపత్ర ప్రచారాలు, గ్రూపు మీటింగులు పెట్టుకోవడానికి కూడా వీలు లేకుండా కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఈ లేబర్ కోడ్స్‌లో మార్చిందన్నారు. కార్మికుల పని భద్రతను గాలికి వదిలేసి, బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ కంపెనీల యజమానులకు అనుకూలంగా ఈ లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈ లేబర్ కోడ్స్ ను రాష్ట్రంలో అమలు చేయమని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులు అందరు మీరు కార్మికుల పక్షాన నిలబడతారా.. లేదా పెట్టుబడిదారుల వైపు ఉంటారా ఆలోచించుకోవాలని, కార్మికులకు నష్టం చేసేటువంటి లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకు సిఐటియు పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంకె రవి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు, సీఐటీయూ నాయకులు వెంకన్న సరిత, అనసూయ, పద్మ, నర్బాయ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినికి టీకా వేస్తున్న దృశ్యం

## బాలికల ఆరోగ్య రక్షణకు ఉచిత టీకా ప్రారంభం

**లింగాపూర్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:**

లింగాపూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 14–15 ఏళ్ల బాలికల కోసం ఉచిత హ్యూమన్ పాపిలోమా వైరస్ టీకా కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని లింగాపూర్ మండల అభివృద్ధి అధికారి రామచందర్, గ్రామ సర్పంచ్ జాధవ్ రాజశేఖర్, వైద్యురాలు వనిత సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాధవ్ రాజశేఖర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ టీకా బాలికల భవిష్యత్తు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ఈ టీకా ద్వారా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని చెప్పారు. 14–15 ఏళ్ల బాలికల తల్లిదండ్రులు తప్పక తమ పిల్లలకు ఈ టీకా వేయించాలని కోరారు. వైద్యులు మాట్లాడుతూ, ఈ టీకా తీసుకోవడం ద్వారా సంబంధిత వైరస్ నుంచి దీర్ఘకాలిక రక్షణ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు జాటోత్ రాహుల్, రాథోడ్ లఖన్, వైద్య సిబ్బంది జాధవ్ దత్తారం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


గోలేటి సిహెచ్పిలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు, కార్మికులు

## నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

### - హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ రాజబాబు

**తాండూర్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని హెచ్ఎంఎస్ యూనియన్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రసిడెంట్ రాజబాబు డిమాండ్ చేశారు. గోలేటి సిహెచ్ పి లో బుధవారం హెచ్ఎంఎస్ యూనియన్ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికులు నల్ల బ్యాడ్జీలతో ధరించి నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను4 లేబర్ కోడ్లుగా కుదించి 60 కోట్ల సంఘటిత, అసంఘటిత కార్మికులను కట్టు బానిసలుగా చేయడానికి కుట్ర చేస్తున్నదన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభు త్వం లేబర్ కోడ్లను అమలు చేయమని రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రం ప్రభుత్వానికి పంపించి సంఘటిత అసంఘటిత కార్మికులకు భరోసా కల్పించాలని కోరారు. పీట్ సెక్రెటరీ ఎండి అరీఫ్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ ఉమామహేశ్వర్, బాలేష్, దీపక్ రాజ్, రాజేష్, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

## జీసీసీ ఉద్యోగి సస్పెన్షన్

### - ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్

**ఉట్నూర్,ఏప్రిల్ 1, ప్రభాతవార్త :**

గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఉట్నూర్.. డివిజన్ పరిధిలోని ఆదిలాబాద్ సొసైటీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న రాథోడ్ గణేష్ ను సస్పెండ్ చేస్తూ ఐటిడిఏ ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్ ఒక ప్రకటనలో తెలిపారు తాంసి మండల కేంద్రంలోని జీసీసీ డిఆర్ డిపో ఇన్చార్జిగా ఉన్న రాథోడ్ గణేష్ పై పలు ఆరోపణలు రావడంతో పాటు ఇటీవల పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీ చేయగా 6.63 క్వింటాళ్ల బియ్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ఈ మేరకు గణేష్ పై పౌరసరఫరాల చట్టం ప్రకారం, డిపో ను సీజ్ చేసి, 6ఏ కేసు నమోదు చేశారు. వీటిని తీవ్రంగా పరిగణించిన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్ జీసీసీ సీనియర్ అసిస్టెంట్ రాథోడ్ గణేష్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఆదేశాలు జారీ చేశారు.

## దేగాంలో వైభవంగా అఖండ హరినామ సప్తాహ ప్రారంభం

**భైంసా, ఏప్రిల్ 01, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని దేగాం గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 11వ అఖండ హరినామ సప్తాహ బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమైంది. స్థానిక శ్రీ సాయిబాబా మందిరంలో గత పదకొండు ఏళ్లుగా ఈ వేడుకలను నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు. సప్తాహ ప్రారంభం సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక చైతన్యాన్ని చాటారు. గ్రామస్థులు ఐక్యంగా ఉంటూ భక్తి మార్గంలో పయనించడానికి, ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించడానికి హరినామ సప్తాహ ఎంతో దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. సప్తాహలో భాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పవిత్ర ఆధ్యాత్మిక గ్రంథాల పారాయణం చేస్తూ భక్తులకు వాటి సారాంశాన్ని వివరిస్తున్నారు. భక్తులు సంప్రదాయబద్ధంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో రాందాస్ గురూజీ, విఠల్ గురూజీ, ఆలయ కమిటీ చైర్మన్ గడ్డిగారి గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ ముత్యం, సర్పంచ్ సుష్మా రెడ్డి, ఉప సర్పంచ్ బాలేకర్ శివాజీ, బాపురావ్ పాటిల్, మోహన్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు జె. చంద్రశేఖర్ స్వామి పాల్గొన్నారు.


అఖండ హరినామ సప్తాహ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

## 24 గంటల నిరవధిక దీక్ష గోడ ప్రతులు విడుదల

**మంచిర్యాల, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**



బుధవారం రోజు మంచిర్యాల పట్టణంలోని బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈనెల ఏడో తేదీన తలపెట్టిన 24 గంటల నిరవధిక దీక్ష గోడ ప్రతులను జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో విడుదల చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా దేశంలో రాష్ట్రంలో బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఉద్యమాలు నడుస్తున్నప్పటికీ దేశాన్ని అత్యధిక సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ కావచ్చు ఇప్పుడు అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ బీసీల ఏ ఒక్క డిమాండ్ పరిష్కరించిన పాపాన పోలేదని, ఇప్పటికైనా బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రెండు ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లాలో ఉన్న బీసీ కులాలు బీసీ వాదులు ఈ యొక్క దీక్షకు సంఘీభావం తెలిపి విజయవంతం చేయాలని బీసీ సమాజానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గజ్జెల్లి వెంకటయ్య, తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ, వేముల అశోక్, మంచెర్ల సదానందం, చెలిమెల అంజయ్య, రామగిరి రాజన్న చారి తదితరులు పాల్గొన్నారు.

## పెగడపల్లిలో సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**జైపూర్, ఏప్రిల్ 01, ప్రభాతవార్త**




సింగరేణి యాజమాన్యం సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఆధ్వర్యంలో జైపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈడి సిహెచ్ చిరంజీవి ప్లాంట్ ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని ఉన్నతాధికారుల సూచన మేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. గ్రామ ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని, తద్వారా ముందస్తుగా వ్యాధి నివారణ చర్యలు చేపట్టవచ్చని, గ్రామంలోని ప్రతి ఒక్కరు ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. డాక్టర్ పవన్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరం లో 50 మంది పరీక్షలు చేయించుకున్నారని, వారికి మందులు పంపిణీ చేశామని తెలిపారు.

# చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

### - అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య



**క్యాతన్ పల్లి, ఏప్రిల్ 01, ప్రభాతవార్త**

క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య సూచించారు. ఈ నెల 4న నిర్వహించనున్న పరోక్ష ఎన్నికల దృష్ట్యా బుధవారం ఆయన క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయాన్ని పరిశీలించి, అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల వేదికలను స్థానిక ఏసీపీ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల నోటీసులను ఎన్నికైన కౌన్సిలర్లకు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌన్సిలర్లకు కూర్చునే ఏర్పాట్లు, సమావేశ మందిరంలో సక్రమంగా అమరికలు, భద్రతా ఏర్పాట్లు, ప్రవేశ-నిష్క్రమణ మార్గాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల సజావుగా జరిగేలా వేదిక, మైక్ వ్యవస్థ, రికార్డు నిర్వహణ వంటి అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. అసిస్టెంట్ ఇంజనీర్‌కు ప్రత్యేకంగా సూచనలు ఇస్తూ, ఎన్నికల వేదిక పరిసర ప్రాంతాలలో బారికేడింగ్‌ను సక్రమంగా ఏర్పాటు చేసి అనవసర గుంపులు చేరకుండా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించి రాకపోకలు సులభంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. సమావేశ ప్రాంగణంలో తాగునీరు, విద్యుత్, శానిటేషన్ వంటి మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసి, ఎలాంటి లోపాలు తలెత్తకుండా పర్యవేక్షించాలని తెలిపారు. చట్టం-శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా స్థానిక ఏసీపీ, సీఐలు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, ఎటువంటి అనూహ్య పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ పర్స రమేష్, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ ఇంజనీర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భద్రతా నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు

### - విద్యుత్ శాఖ సర్కిల్ ఎస్ఈ ఉత్తమ్ జాడే

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :**

భద్రతా నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ సర్కిల్ ఎస్ఈ ఉత్తమ్ జాడే బుధవారం హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ పనులు నిర్వహించే ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా భద్రతా పరికరాలు ధరించి పనిచేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా హెల్మెట్, హ్యాండ్ గ్లౌజ్, ఎర్త్ రాడ్ వంటి భద్రతా పరికరాలు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు చేయరాదని ఆయన తెలిపారు. ఐనప్పటికి కొన్ని చోట్ల భద్రతా పరికరాలు ఉపయోగించకుండా పనిచేయడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుని విలువైన ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఉద్యోగుల భద్రత మా అగ్ర ప్రాధాన్యతయని, పలు మార్లు విద్యుత్ ప్రమాదాలపై సిబ్బందికి అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. ఉద్యోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పలు కార్యక్రమాలు చేపట్టామని, అందులో భాగంగా ఎల్సీ (లిది) యాప్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా లైన్ క్లియరెన్స్ (లిది) ప్రక్రియను సులభతరం చేసి తప్పిదాలను నివారించవచ్చని వివరించారు.



గణేష్ కుటుంబానికి పది వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

## వెడ్మ ఫౌండేషన్ చేయూత

**ఉట్నూర్, ఏప్రిల్ 1, ప్రభాత వార్త :**

ఉట్నూర్ మండలం లోని వడోని గ్రామానికి చెందిన తోర్గే గణేష్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆ కుటుంబానికి అండగా నిలిచారు. పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు .ఈ కార్యక్రమంలో వెడ్మ ఫౌండేషన్ సభ్యులు నగేష్ , అక్షయ్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు జాదవ్ రాజేష్ తో పాటు బాధిత కుటుంబసభ్యులు ఉన్నారు.



## లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే

**జన్నారం, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

జన్నారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొని, కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపడుచుల వివాహాలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఒక వరమని, రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు నాయకులు పాల్గొన్నారు.

## పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు

**తిర్యాని, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

తిర్యాని మండలంలోని సుంగపూర్ గ్రామంలో బుధవారం తిర్యాని పశువైద్యశాల ఆధ్వర్యంలో ఆవులకు, గేదెలకు గాలి కుంటు వ్యాది నివారణ టికాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి సాగర్ మాట్లాడుతూ పశువులు ఏ చిన్న అనారోగ్యానికి గురైన వెంటనే వైద్యశాలకు తీసుకుని వచ్చి చికిత్స చేయించి రైతులు తమ విలువైన పశుసంపదను కాపాడుకోవాలని ఆయన కోరారు. అలాగే ప్రభుత్వం నుండి పశువులకు పంపిణి చేస్తున్న టీకాలను రైతులందరు తమ పశువులకు వేయించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం 188 పశువులకు టీకాలను వేశారు. ఈ కార్యక్రమములో సుంగాపూర్ గ్రామ సర్పంచ్ టేకం సురేష్, సిబ్బంది సురేష్, మనోహర్, రాకేష్, సంతోష్, గ్రామ పెద్దలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.






## పొదుపుతో పిల్లల భవిష్యత్‌కు భరోసా

**ఆసిఫాబాద్ టౌన్ , ఏప్రిల్ 1, ప్రభాతవార్త :**

పొదుపుతో పిల్లల భవిష్యత్తుకు భరోసాగా నిలుస్తుందని ఆసిఫాబాద్ వాసవి క్లబ్ అధ్యక్షుడు మర్యాల ఉదయ్ బాబు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తపాలా కార్యాలయంలో ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ఆదేశాల మేరకు పోస్టల్ సేవింగ్ డేను నిర్వహించారు. పొదుపుపై చిన్నారుల ప్రోత్సాహం కోసం అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు పొదుపు ఖాతాలు తెరిపించడంతో భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. పోస్టల్ శాఖలోని ఆర్డిలో రూ. 100 తో పొదుపు ఖాతా తెరిచే అవకాశం ఉందన్నారు. అనంతరం పోస్టల్ అసిస్టెంట్ అవినాష్ కుమార్ మాట్లాడుతూ తపాలా శాఖ ద్వారా అందుతున్న పలు సేవలను వివరించారు. సుకన్య ఎన్ఎస్సి, కిసాన్ వికాస్ పత్, ఎంఐఎస్ వంటి పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్రీధర్, పోస్టల్ సిబ్బంది మనోజ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక నిర్ణయాలు వెంటనే ఉపసంహరించుకోవాలి

### - సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం




**తాండూర్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

కార్మిక వ్యతిరేక విధానాలు, నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలనిసిఐటియు మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఐబిలో బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి ప్లే కార్డులు పట్టుకొని బ్లాక్ డే నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయమాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్స్ లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం 2025, వి.బి.జి, రామ్ జి చట్టం, విత్తన నల్ల చట్టాలను సవరణ బిల్లు, ఎల్.ఐ.సిలో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించడం కార్మిక వర్గానికి తీరని అన్యాయమన్నారు. కార్మిక, ప్రజా, రైతు, వ్యతిరేక విధానాలు అవలంబించి ప్రభుత్వాలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో లీలారాణి, సత్యవతి, విజయలక్ష్మి, సుజాత, లీలారాణి, మగ్దూం, తదితరులు పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ

**వాంకిడి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :**

వాంకిడిమండల కేంద్రంలోని పశువులను ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షించేందుకు ప్రభుత్వం చేపట్టిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని వాంకిడి సర్పంచి చూనార్కర్ సతీష్ బుధవారం అధికారికంగా ప్రారంభించారు. పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పశువులకు టీకాలు వేసే ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వాంకిడి సర్పంచి మాట్లాడుతూ.. వర్షాకాలం మరియు వాతావరణ మార్పుల సమయంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం ఉందని, దీనివల్ల రైతులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందనిగ్గ పేర్కొన్నారు. ముందు జాగ్రత్తగా పశువులన్నింటికీ టీకాలు వేయించడం ద్వారా ఈ వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. గ్రామంలోని ప్రతి రైతు తమ వద్ద ఉన్న ఆవులు, ఎద్దులు మరియు గేదెలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని అన్నారు . పశువైద్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి టీకాలు వేస్తారని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారులు, ఉప సర్పంచ్ దీపక్ ముండే, వార్డు సభ్యులు రాము, నాందేవ్ మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.



గాలికుంటు వ్యాధి టీకాలను వేయిస్తున్న వాంకిడి గ్రామ సర్పంచ్ చునర్కర్ సతీష్



చలివేంద్రాన్ని ప్రారంభించిన యువజన సంఘం నాయకులు

## జన జాగృతి యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

**లింగాపూర్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :**

లింగాపూర్ మండలంలోని జాముల్దార గ్రామంలో తీవ్రమైన ఎండ ప్రభావంతో ప్రజలకు మంచినీరు అందించాలనే ఉద్దేశంతో. జన జాగృతి యువజన సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాన్ని,ఎండ తీవ్రతని గుర్తుంచుకొని ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించిన యువకులను చూసి ప్రతి ఒక్క యువత సేవా భావంతో మెలగాలని కొనియాడారు. మానవసేవే మాధవసేవ ప్రతి ఒక్క యువత సమాజ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్ర అర్జున్, జుగ్గునక యశ్వంత్ ,మారుతి హనుమంతరావు, రాము తదితరులు పాల్గొన్నారు.



కమిటి సభ్యులతో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

## అంబేద్కర్ జయంతి మహా ర్యాలీ పోస్టర్ల ఆవిష్కరణ

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :**

ఈ నెల 14న నిర్వహించనున్న భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా చేపట్టిన మహా ర్యాలీకి సంబంధించిన గోడ పోస్టర్లను బుధవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోనేరు కోనప్ప మాట్లాడుతూ, డాక్టర్ అంబేద్కర్ ఆలోచనలు,రాజ్యాంగ విలువలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలవాలని అన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం స్థాపన కోసం అంబేద్కర్ చేసిన కృషి ఎప్పటికీ చిరస్మరణీయమని పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 14న జరగనున్న ర్యాలీలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల జయంతి వర్ధంతిలను ఘనంగా నిర్వహిద్దాం

**- బీసీ రచయితల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ గాజోజు నాగభూషణం**

**మంచిర్యాల, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

ఈ నెలలో వచ్చే బడుగు యోధుల మహనీయుల జయంతి వర్ధంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని బీసీ రచయితల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ గాజోజు నాగభూషణం అన్నారు. బుధవారం చార్వాక హాస్పిటల్ సమావేశ మందిరం వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయులను వారి జీవిత చరిత్రను భవిష్యత్ తరాలకు అందించడానికి బడుగుల జ్ఞాన పండుగలుగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెలలో పోతులూరి వీరబ్రహ్మం, మహాత్మా జ్యోతిబాపూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, గౌతు లచ్చన్న, దొడ్డి కొమరయ్య, శివసాగర్, అనిశెట్టి రజిత తదితర సామాజిక యోధుల జయంతులు వర్ధంతులు ఉన్నందువలన ఈ నెలకు అధిక ప్రాముఖ్యత ఉన్నదని అన్నారు. బీసీ రచయితలు అందరూ రచనల ద్వారా తమ ఐక్యతను చాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ గోపగాని రవీందర్, ప్రసిద్ధ కవి అల్లాడి శ్రీనివాస్, డాక్టర్ నీలకంఠేశ్వరరావు, దుర్గం రాజేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ సభలను విజయవంతం చేయాలి

**- ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్**

**బెజ్జూర్,ఏప్రిల్ 1,ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ మండలంలోని సర్పంచులు,గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఇట్టి సమావేశంలో గ్రామ సభకు తప్పనిసరిగా గ్రామపంచాయతీలోని వార్డు సభ్యులు,అధికారులు,గ్రామస్తులందరూ హాజరయ్యే విధంగా చూడాలని సూచించారు.సమావేశంలో ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించాలని,6 గ్యారెంటీలపై అవగాహన కల్పించాలని,ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూడాలని సూచించారు.ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించే విధంగా చూడాలని కోరారు.గ్రామ సభలను విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రామ్మోహన్,ఏఓ నాగరాజు,ఎంఈఓ సునీత,మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ




## బెల్లంపల్లిలో ప్రభుత్వ పాలన శాస్త్ర విద్యార్థుల క్షేత్ర పర్యటన

**బెల్లంపల్లి, ఏప్రిల్ 01, ప్రభాతవార్త**

బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. సీనియర్ అధ్యాపకులు గజెల్లి మోహన్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులు బెల్లంపల్లి మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బెల్లంపల్లి పట్టణంలోని చిల్డ్రన్స్ పార్క్, కన్నాల బస్తీ పార్క్, మొక్కల నిర్వహణ కేంద్రం, మంచినీటి సరఫరా ట్యాంక్, కూరగాయల మార్కెట్, రోడ్ల అభివృద్ధి పనులు, డంపింగ్ యార్డ్, చెత్త నిర్వహణ వంటి పలు ప్రాజెక్టులను ప్రత్యక్షంగా వీక్షించారు. అదనంగా మున్సిపాలిటీ పరిపాలనలోని వివిధ శాఖల పనితీరును కూడా తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డిని కలిసి అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ప్రజల సహకారం సమృద్ధిగా లేకపోవడం వల్ల పూర్తి స్థాయి ఫలితాలు సాధ్యంకావడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వం

**- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**జన్నారం, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వం అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా జన్నారం మండలానికి మంజూరైన ఐదు పవర్ టిల్లర్లను పొనకల్ రైతు వేదికలో బుదవారం నాడు రైతులకు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వమని రైతుల అభ్యున్నతే మా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశామని అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు ఒక యూనిట్ ఖర్చు 2,43,000 రూపాయలు ఉండగా ప్రభుత్వం 1,20,000 రూపాయల సబ్సిడీ ఇవ్వడం జరిగిందని అన్నారు.జన్నారం మండలం లోని వివిధ గ్రామాల రైతులు కోట శంకర్, కొండపర్తి అంజవ్వ, దుర్గం రాజు, సంతపురి ఇందూరు, కోట కిషన్ లకు పవర్ టిల్లర్లు మంజురయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు త్రిసంధ్య, అక్రముల్లా ఖాన్, దివ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

**వాంకిడి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :**



వాంకిడి మండల కేంద్రం లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అర్జుగూడ పాఠశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి శివ చరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రతిరోజు తల్లిదండ్రులు విద్యార్థులను బడికి పంపాలని, ప్రభుత్వ బడిలో న్యాయమైన బోధన చేస్తున్నామని విద్యార్థులను ప్రభుత్వ బడికే పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల వార్షికోత్సవం కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాలు కన్నుల విందుగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చునార్కర్ ధర్మాబాయి ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాంకిడి కాంప్లెక్స్ మరియు కిరిడి కాంప్లెక్స్ ల ప్రధానోపాధ్యాయులు నటరాజ్ మరియు ప్రభోద్ కుమార్ వాంకిడి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ దీపక్ ముండే ,వార్డు మెంబర్ శంకర్ ,అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మెన్ మరియు 7వార్డు మెంబర్ అల్లోజు సంధ్యారాణి ఉపాధ్యాయులు శ్రీనివాస్,జగదీష్, ప్రశాంత్, సి ఆర్ పి లు దుర్గం సందీప్ ,సునీల్, విజయ బాబు , అంగన్వాడీ టీచర్ ప్రతిమ, గ్రామస్తులు , విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మన ఇసుక వాహనం ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభం

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :**

ప్రజలకు నాణ్యమైన ఇసుక సరఫరాను మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం ˘మన ఇసుక్త విధానం ప్రవేశ పెట్టిందని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. బుధవారం ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఇసుక వాహనం ఆన్‌లైన్ బుకింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాన్య ప్రజలకు ఇసుక కొరత, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. మన ఇసుక యాప్ ఎంఐవి ద్వారా ఆన్లైన్ బుకింగ్ తో పారదర్శకత పెరుగుతుందని, వినియోగదారులు తమకు కావాల్సిన ఇసుకను నిర్ణీత ధరకే పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇసుక రవాణా చేసే వాహనదారులు కూడా నిబంధనలకు లోబడి పనిచేయాలని ఆదేశించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలోని రికార్డు రూమును జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు.



కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ హరిత